క్లుప్తంగా

పెద్దిరెడ్డిని కలసిన మధుసూదన్‌రెడ్డి



పెద్దిరెడ్డితో బియ్యపు మధుసూదన్‌రెడ్డి, సిరాజ్‌బాషా

శ్రీకాళహస్తి: మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కలసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన్ను ఘనంగా సత్కరించారు. అదేవిధంగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి షేక్ సిరాజ్‌బాషా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని హైదరాబాద్‌లో కలసి శుభాకాంక్షలు తెలిపారు. నేత బత్తల హరిప్రసాద్ పాల్గొన్నారు.

బాలికలపై వివక్ష చూపొద్దు



ర్యాలీలో ఐసీడీఎస్ సిబ్బంది, కిశోర బాలికలు

నాగలాపురం: బాలికలపై వివక్ష చూపకుండా అన్ని రంగాల్లోనూ రాణించేలా ప్రోత్సహించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి తెలిపారు. మండలంలోని చిన్నాపట్టు అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం కిశోర బాలికలతో గ్రామంలో ర్యాలీ చేశారు. ఆమె మాట్లాడుతూ బాలికలకు మంచి విద్య, వైద్యం అందించడం అందరి బాధ్యత అన్నారు. అంగన్‌వాడీ టీచర్లు దీప, రాజేశ్వరి పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులకు చెక్



మాట్లాడుతున్న వెంకటేశులు

బుచ్చినాయుడుకండ్రిగ: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా సీజనల్ వ్యాధులను నివారించవచ్చునని మండల ఆరోగ్య అధికారి వెంకటేశులు తెలిపారు. ఆయన శనివారం బుచ్చినాయుడుకండ్రిగలోని బీసీ, ఎస్సీ బాలుర, బాలికల వసతి గృహాలను పరిశీలించారు. వంటగది, మరుగుదొడ్లను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరిసరాల్లో పిచ్చిమొక్కలు పెరగకుండా చూడాలని ఆదేశించారు.

సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభం

సత్యవేడు: మండలంలోని ఇరుగుళం పంచాయతీ సచివాలయం ప్రధాన వీధిలో 425 మీటర్ల సిమెంట్ రోడ్డు పనులను ఎంపీపీ వి.ప్రతిమ శనివారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ రూ.12 లక్షల మండల పరిషత్ నిధులు, రూ.10 లక్షల ఎంపీ నిధులతో రోడ్డు పనులు చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శేఖర్, ఏఓ త్రివిక్రమరావు, సెక్రటరీ సాయి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రాజేష్, శ్రీధర్ రెడ్డి, రామచంద్రారెడ్డి, హరినాథ్‌రెడ్డి, బాబు రెడ్డి, మునికృష్ణారెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, కరుణాకర్ రెడ్డి, నరేష్ రెడ్డి, శశిధర్‌రెడ్డి, కాశీప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు.

జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా రమణయ్య



వెంకటరమణయ్యకు సత్కారం

శ్రీకాళహస్తి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన బాలాజీ స్కూల్ కరస్పాండెంట్ వై.వెంకటరమణయ్యను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధన్ ముదిరాజ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు జిల్లా గంగపట్నం చాముండేశ్వరి ఆలయ ఆవరణలో ముదిరాజ్ మహాసభ గౌరవ అధ్యక్షుడు కోర్నా వెంకటనారాయణ ఆధ్వర్యంలో జరిగిన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో వైవి రమణయ్య నియామక పత్రం అందుకున్నారు. పలువురు అతన్ని సన్మానించారు.

పాండూరులో వైభవంగా శ్రీనివాస కల్యాణం

వరదయ్యపాళెం: మండలంలోని పెద్ద పాండూరులో వెలసిన కోదండరామస్వామి ఆలయంలో పెరటాశి నెల నాలుగో శనివారాన్ని పురస్కరించుకుని శ్రీనివాస కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త పరంధామరెడ్డి దంపతులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ప్రత్యేక పూజలు చేశారు. చిన్న పాండూరు జంగంపాళెంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి ఉత్సవాలను నిర్వహించారు.

సత్యవేడు టీడీపీలో చిచ్చు

- పళ్లికొండేశ్వరాలయ పాలక కూర్పుపై అసంతృప్తి
- ఎమ్మెల్యే వర్గానికి మొండిచేయి
- మిత్రపక్షమైన బీజేపీకి చోటే లేదు
- పార్టీ కోఆర్డినేటర్ కనుసన్నల్లోనే పాలక మండలి



పళ్లికొండేశ్వరాలయం

సత్యవేడు నియోజకవర్గంలో కీలక నామినేటెడ్ పదవుల్లో ఒకటైన పళ్లికొండేశ్వరస్వామి ఆలయ పాలక మండలి ఏర్పాటు టీడీపీలో చిచ్చు రేపుతోంది. పార్టీ కోసం కష్టపడిన వారిని పక్కనపెట్టి వెన్నుపోట్లు పొడిచిన, సభ్యత్వం లేని వారికి పాలక మండలిలో చోటు కల్పించడంపై నాయకులు, కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలోని 7 మండలాలకు ప్రాధాన్యం కల్పిస్తూ గతంలో పాలక మండలి ఏర్పాటయ్యేది. ప్రస్తుతం వరదయ్యపాళెం, బీఎన్‌కండ్రిగ, నారాయణవనం మండలాలకు చోటు దక్కకపోవడంపై ఆశావహులు గుర్రుగా వున్నారు.

వరదయ్యపాళెం: కూటమి ప్రభుత్వం ఏర్పాటైన 16 నెలల నుంచి పళ్లికొండేశ్వరాలయం పాలక మండలి ఎప్పుడు ఏర్పాటవుతుందో అని చాలామంది నాయకులు ఎదురుచూపులు చూశారు. తమకే పదవి వస్తుందని ఆశించారు. తీరా పార్టీ కోసం కష్టపడిన వారికి, ఆశావహులకు కాకుండా పార్టీ కోఆర్డినేటర్ సూచించిన వారికి పదవులు కట్టబెట్టారు. గురువారం అర్ధరాత్రి పాలక మండలిని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కూటమి ప్రభుత్వ పెద్దలు, అతిథులు ఎవరూ లేకుండానే అదే రోజు ఆగమేఘాలపై చైర్మన్‌గా నియమితులైన పద్మనాభరాజు ప్రమాణ స్వీకారం కార్యక్రమాన్ని కానిచ్చేశారు. అంత అర్జెంటుగా ప్రమాణ స్వీకారం చేయడానికి కారణమేమిటని టీడీపీ శ్రేణులే గుసగుసలాడుతున్నారు. చైర్మన్‌గిరి కోసం ఆశావహులుగా ఉన్న కీలక నేతలు న్యాయస్థానాన్ని ఆశ్రయించి ఉత్తర్వులను అడ్డుకుంటారేమోనని ఆందోళనతో హడావుడిగా ప్రమాణ స్వీకారం చేయించారని ఆ పార్టీ వారే చెబుతున్నారు.

సభ్యుడి గైర్హాజరు

పాలక మండలి చైర్మన్ కోసం తీవ్రంగా ప్రయత్నించి భంగపాటుకు గురైన టీడీపీ సీనియర్ నేత, సత్యవేడు మండలానికి చెందిన కృష్ణయ్యకు సభ్యుడిగా అవకాశం కల్పించారు. దీనిపై ఆయన ఆగ్రహం చెంది పాలక మండలి ప్రమాణ స్వీకారానికి సైతం గైర్హాజరయ్యారు. త్వరలోనే ఆ విషయాల గురించి పాత్రికేయుల సమావేశంలో వెల్లడిస్తారని సమాచారం. కూటమి ప్రభుత్వంలో మిత్రపక్షమైన బీజేపీకి పళ్లికొండేశ్వరాలయ పాలక మండలిలో చోటు దక్కలేదు. మరో మిత్రపక్షమైన జనసేనకు ఒక సభ్యుడిని కేటాయించారు. దీంతో బీజేపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యే వర్గానికి మొండిచేయి

నియోజకవర్గ సిట్టింగ్ ఎమ్మెల్యే వర్గానికి సైతం పాలక మండలిలో చోటు లభించలేదు. పిచ్చాటూరు మండలానికి చెందిన నాయకుడు ఒకరు ఎమ్మెల్యే వెంట నడుస్తూ సురుటుపల్లి ఆలయ పాలక మండలి చైర్మన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. మరికొందరు సభ్యులుగా అవకాశం కల్పించాలని కోరారు. ఏ ఒక్కరికీ అవకాశం రాకపోవడంతో వారికి నిరాశే మిగిలింది. అలాగే గతంలో పాలక మండలిలో గిరిజనులకు ఒకరికి సభ్యుడిగా అవకాశం కల్పించారు. తాజాగా ఒకరు కూడా లేకపోవడంపై ఆ వర్గం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కోఆర్డినేటర్ కనుసన్నల్లోనే

సిట్టింగ్ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంను సస్పెండ్ చేయడంతో ఇటీవల ప్రోగ్రామ్ కోఆర్డినేటర్‌గా కూరపాటి శంకర్‌రెడ్డిని పార్టీ అధిష్టానం నియమించింది. ఆయన నియోజకవర్గంలోని పార్టీ కేడర్‌ను పూర్తిస్థాయిలో తన వైపునకు తిప్పుకున్నారు. ఈ నేపథ్యంలోనే పళ్లికొండేశ్వరస్వామి ఆలయ పాలక మండలిలో తన మార్క్‌ను చూపించారు. సభ్యులుగా నియమితులైన వారిలో కొందరికి పార్టీ సభ్యత్వం కూడా లేదని, మరికొందరు గత ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిని ఓడించేందుకు స్వతంత్ర అభ్యర్థితో చేతులు కలిపారని విమర్శలు వినిపిస్తున్నాయి.

వేదనారాయణ స్వామి ఆలయంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న శ్రీ వేద నారాయణ ధర్మ రక్షణ సమితి సభ్యులు

నాగలాపురం: స్థానిక టీటీడీ అనుబంధ వేదవల్లి సమేత వేదనారాయణస్వామి ఆలయంలో పెరటాశి నెల నాలుగో శనివారం సందర్భంగా శ్రీ వేదనారాయణ ధర్మ రక్షణ సమితి ఆధ్వర్యంలో ప్రజలకు అన్నదానం చేశారు. ఇందుకు నాగలాపురానికి చెందిన పెనుగొండ వేణుశెట్టి, వారి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారని ఆలయ అధికారి చెంగల్‌రాయులు, శ్రీనివాసులు తెలిపారు.

టీటీడీ కల్యాణ మండపం పనుల పరిశీలన

సత్యవేడు: సత్యవేడులో నూతనంగా నిర్మిస్తున్న టీటీడీ కల్యాణ మండపం, అన్నా క్యాంటీన్ పనులను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పరిశీలించారు. త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ డి. ఇలంగోవన్ రెడ్డి, పద్దురాజు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న వెంకటయ్య

తొట్టంబేడు: డప్పు కళాకారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఏపీ డప్పు కళాకారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సంక్రాంతి వెంకటయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో శనివారం ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ప్రాచీన కళ డప్పు పట్ల పాలక ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆయన వాపోయారు. ఇకనైనా ప్రభుత్వంలో కదలిక రాకుంటే ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. జిల్లా గౌరవాధ్యక్షుడు అంగేరి పుల్లయ్య, సహాయ కార్యదర్శి అరుణాచలం, రఘు, సురేష్, అక్బర్ బాషా, వెంకటమునిగురవయ్య, గోవిందస్వామి, నారాయణ పాల్గొన్నారు.

బీసీ హాస్టల్ తనిఖీ



హాస్టల్లో ఆర్వో ప్లాంట్‌ను పరిశీలిస్తున్న వైద్యాధికారులు

రేణిగుంట: పట్టణంలోని ప్రభుత్వ బీసీ హాస్టల్‌ను ఆరోగ్యశాఖ డిప్యూటీ డెమో కిరణ్‌కుమార్ శనివారం తనిఖీ చేశారు. వంటగది, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలను పరిశీలించి పరిశుభ్రతపై సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, దోమల నివారణ, నీటిని కాచి తాగడంపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ కామరాజ్, హాస్టల్ వార్డెన్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్



డిజిటల్ బుక్, క్యూఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న నేతలు

నారాయణవనం: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉండడానికే పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్‌ను ఆవిష్కరించారని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. వారు శనివారం నారాయణవనంలో డిజిటల్ బుక్, క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఎంపీపీ దివాకర్‌రెడ్డి, వాణిజ్య విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, జిల్లా క్రియాశీల కార్యదర్శి రాకేష్ కిరణ్ మాట్లాడుతూ పార్టీ శ్రేణులపై జరిగే దాడులను మొబైల్ క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి లేదా 040-49171718 నంబర్‌కు కాల్ చేసి డిజిటల్ బుక్‌లో నమోదు చేయవచ్చని తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్యకర్తలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శివశంకర్, ఎంపీటీసీలు పొన్నుస్వామి, రవి, సర్పంచులు సాయిరవి, సుబ్రమణ్యంరెడ్డి, నాగూరు, గుణశేఖర్, మురళి పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంపై దర్యాప్తు జరపాలి



సీఎంఆర్ కంపెనీని సందర్శించిన నేతలు

ఏర్పేడు: మండలంలోని చింతలపాళెం టోల్‌గేట్ సమీపంలోని సీఎంఆర్ ఎకో అల్యూమినియం పరిశ్రమలో జరిగిన అగ్నిప్రమాదంపై లోతైన దర్యాప్తు జరిపి ప్రమాదానికిగల కారణాలను గుర్తించాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు కరిముల్లా డిమాండ్ చేశారు. శనివారం వారు కంపెనీని సందర్శించి ప్రమాదం గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఏర్పేడు మండలంలో వివిధ పరిశ్రమల్లో తరచూ అగ్నిప్రమాదాలు జరగడం అనుమానాలకు తావిస్తోందన్నారు. సీపీఎం ఏరియా కార్యదర్శి హరినాథ్, సీఐటీయూ ఏర్పేడు మండల కార్యదర్శి రాంబాబు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రంగయ్య, వెంకటాద్రి పాల్గొన్నారు.

అక్రమ నిల్వలు ఉంటే చర్యలు

శ్రీకాళహస్తి: టపాసులు అక్రమంగా నిల్వ ఉన్నా, రవాణా చేసినా చర్యలు తప్పవని శ్రీకాళహస్తి రెండవ పట్టణ సీఐ నాగార్జునరెడ్డి అన్నారు. రెండవ పట్టణ పరిధిలోని లైసెన్స్ కలిగిన టపాసుల దుకాణాలను శనివారం ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ లైసెన్సులు లేకుండా టపాసులు విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు.

క్రీడాకారుల ఎంపిక పోటీలు



కబడ్డీలో పాల్గొన్న క్రీడాకారిణులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని కన్నా క్రికెట్ అకాడమీలో జరిగిన 11మండలాల డివిజన్ ఎంపిక పోటీలు శనివారం జరిగాయి. ఎంపిక ప్రక్రియ తిరుపతి జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ పి.కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. అండర్-14 క్రికెట్ సెలక్షన్స్ నిర్వహించారు. ఈ డివిజన్‌లో ఎంపికైన క్రీడాకారులు ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎంపిక పోటీల్లో పాల్గొనడానికి అర్హత సాధిస్తారు. కార్యక్రమంలో పీడీలు సతీష్, హేము, రమణ, వినోద్, బాబు, కన్నా, క్రాంతి పాల్గొన్నారు

అదేవిధంగా స్థానిక ఆర్ట్స్ కాలేజ్ గ్రౌండ్‌లో అండర్-14, 17 బాల బాలికల కబడ్డీ జిల్లా స్థాయి పోటీలకు డివిజన్ స్థాయి ఎంపిక పోటీలు జరిగాయి. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సతీమణి రిషితా రెడ్డి, బీజేపీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ కోలాఆనంద్, పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, పీఈటీలు, పీడీలు పాల్గొన్నారు.



ఎంపికైన క్రీడాకారులు

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ సిగ్గుచేటు

- వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్
- కోటి సంతకాల సేకరణ
- ఈనెల 28న సత్యవేడులో నిరసనలు



కోటి సంతకాల ప్రజా ఉద్యమం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నూకతోటి రాజేష్

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రభుత్వ వైద్య కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడం సిగ్గుచేటని వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన శనివారం పార్టీ మండల కన్వీనర్ కొణతనేని మణినాయుడు ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమం పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు వైద్య విద్యను అందించాలన్న ఉద్దేశంతో మాజీ సీఎం జగనన్న 17 మెడికల్ కళాశాలలను తీసుకొచ్చారని తెలిపారు. వాటిని కూటమి ప్రభుత్వం ప్రైవేటు పరం చేయడానికి పూనుకోవడం దారుణమన్నారు. తద్వారా పేద పిల్లలు వైద్య విద్యకు దూరం అవుతారని వివరించారు. కూటమి ప్రభుత్వం తీరును నిరసిస్తూ మెడికల్ కళాశాలల పరిరక్షణకు వైఎస్సార్‌సీపీ కోటి సంతకాల సేకరణ, ప్రజా ఉద్యమాన్ని చేపట్టిందన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరేంద్రవర్మ, పార్టీ స్టేట్ గ్రీవెన్స్ సెల్ కార్యదర్శి సాయినాయుడు, స్టేట్ ఎస్సీ సెల్ కార్యదర్శి ఉగ్గుమూడి గురునాథం, ఉమ్మడి చిత్తూరు జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ వేలూరు రాకేష్, భానుప్రకాష్‌రెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు బొర్రా మాధవీరెడ్డి, వైస్ ఎంపీపీ బాబురెడ్డి, జొన్నల గోపాల్‌రెడ్డి, రవిరెడ్డి, అజయ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గురవయ్య, ప్రసాద్ పాల్, జయచంద్రనాయుడు, అశోక్, కోటేశ్వరరావు, అమరలింగయ్య, కిరణ్‌యాదవ్ పాల్గొన్నారు.

ప్రశ్నించకుంటే ప్రైవేటీకరణ తప్పదు

కేవీబీపురం: ప్రజలు ప్రశ్నించకుంటే మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ తప్పదని వైఎస్సార్ సీపీ సత్యవేడు సమన్వయకర్త నూకతోటి రాజేష్ తెలిపారు. కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ ప్రజలు పెద్ద సంఖ్యలో ప్రభుత్వాన్ని నిలదీయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆయన శనివారం ఆ పార్టీ మండల కన్వీనర్ గవర్ల కృష్ణయ్య ఆధ్వర్యంలో కేవీబీపురంలో కోటి సంతకాల సేకరణ, ప్రజా ఉద్యమం పోస్టర్లను ఆవిష్కరించారు.

నేడు మెగా జాబ్ మేళా

శ్రీకాళహస్తి: పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం తెలిపింది. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఉదయం 9గంటలకు మెగా జాబ్‌మేళా ప్రారంభమవుతుందని పేర్కొంది. అర్హులైన వారు ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ప్రకటనలో కోరింది.

ఘనంగా మాజీ మంత్రి పెద్దిరెడ్డి జన్మదిన వేడుకలు



సత్యవేడులో పేదలకు అన్నదానం చేస్తున్న నాయకులు



బుచ్చినాయుడుకండ్రిగలో అన్నదానం చేస్తున్న నూకతోటి రాజేష్

సత్యవేడు: మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలను శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సత్యవేడులో ఘనంగా జరుపుకున్నారు. పార్టీ మండల కన్వీనర్ కే.సుశీల్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహం సమీపంలో కేక్ కట్‌చేసి పంచి పెట్టారు. పేదలకు అన్నదానం చేశారు. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కేవీ నిరంజన్‌రెడ్డి, సురుటుపల్లి ఆలయ మాజీ చైర్మన్ ఏపీఎం బాలాజీ రెడ్డి, యువజన విభాగం సెక్రటరీ రమేష్, ఎంపీ రవి, మస్తానీ, జోసెఫ్, నాగరాజు, వెంకటేష్, టెంకాయల కృష్ణయ్య, సోము, లారెన్స్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

నాగలాపురం: నాగలాపురం మండలంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక బజారు వీధిలోని టవర్ క్లాక్ కూడలిలో వున్న వైఎస్ఆర్ విగ్రహం వద్ద సర్పంచ్ చిన్నదొరై సుధా ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పేదలకు పంచిపెట్టారు. నాయకులు మోహన్ మొదలియార్, ఉదయ్ కుమార్ రెడ్డి, కులశేఖర్ రెడ్డి, ఉదయ్, దేశప్పన్, చిరంజీవి, ధనరాజ్, రాజా, ఏలుమలై, రాజామణి పాల్గొన్నారు.

పిచ్చాటూరులో..

పిచ్చాటూరు (నాగలాపురం): పిచ్చాటూరులో పార్టీ కార్యాలయం వద్ద మండల కన్వీనర్ చలపతిరాజు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచి పెట్టారు. సుబ్రమణ్యం, సూరిబాబురెడ్డి, రామచంద్రయ్య, పరంధామనాయుడు, రాజు, వెంకటేష్, అయ్యప్ప, కరుణామూర్తి, విశ్వనాథం, వాసురెడ్డి, రాఘవ రెడ్డి పాల్గొన్నారు.



వరదయ్యపాళెం : గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న నూకతోటి రాజేష్, పెద్దిరెడ్డి మల్లికార్జునరెడ్డి

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: పార్టీ మండల కన్వీనర్ మణినాయుడు ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

వరదయ్యపాళెంలో..

వరదయ్యపాళెం: మండలంలోని చెరివి రోడ్డు కూడలిలో శనివారం మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదినాన్ని వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్, శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి మాజీ సభ్యుడు, పార్టీ రైతు సంఘం అధ్యక్షుడు పెద్దిరెడ్డి మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేశారు. పార్టీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లాల మహిళా విభాగం అధ్యక్షురాలు బొర్రా మాధవి, జిల్లా అధికార ప్రతినిధి చిన్నా, ఎంపీటీసీ సామర్ల భువనేశ్వరి, భాస్కర్‌రెడ్డి, హరిబాబురెడ్డి పాల్గొన్నారు.

కేవీబీపురంలో..

కేవీబీపురం: మండల కేంద్రంలో శనివారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గవర్ల కృష్ణయ్య, మాజీ జెడ్పీటీసీ డేవిడ్, ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. నేతలు దశరథరామిరెడ్డి, శాస్త్రిరాజు, ఎంపీటీసీ అయ్యప్ప, సర్పంచ్ గిరిబాబు, ఆరువేలు, అరుల్, అరుణాచలం పాల్గొన్నారు.

దూండి వినాయకస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

నారాయణవనం: నారాయణవనం బైపాస్ సమీపంలోని దూండి వినాయకస్వామి ఆలయంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సొరకాయలు ఆధ్వర్యంలో పూజలు చేసి పేదలకు అల్పాహారం అందజేశారు.

ఘనంగా బాలికల దినోత్సవం



ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

రేణిగుంట: మండలంలోని గురవరాజుపల్లి ఎస్టీ కాలనీలో శనివారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా స్ఫూర్తి బాలల సంఘం, ప్రగతి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. కిశోర బాలికలు, మహిళలు, గ్రామస్తులు కాలనీలో ర్యాలీ నిర్వహించారు. బాల్య వివాహాలు నిరోధించాలని ప్రదర్శన నిర్వహించి బెలూన్లు ఎగురవేశారు. రేణిగుంట మండల కో-ఆర్డినేటర్ జయలక్ష్మి, శిరీష, చంద్రశేఖర్, కానిస్టేబుల్ మణి, నాగమ్మ, అంగన్‌వాడీ టీచర్ ధరణి పాల్గొన్నారు.